సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 3 । నవంబర్ । 2024



సిరులతల్లికి తులసీదళార్చన

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు.



అలరించిన త్యాగరాజ కృతులు

విశాఖ : నగరంలోని జీవీకే కళాశాలలో ప్రముఖ గాయని ముట్నూరి జలజాక్షి కర్ణాటక గాత్ర కచేరి ప్రేక్షకులను అలరించింది.



తిరునక్షత్రం పూజలు ప్రారంభం

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తిరునక్షత్రం పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

న్యూస్‌రీల్

నదీ సంగమ తీరంలో ప్రత్యేక పూజలు



నదీ సంగమ తీరంలో స్వామి వారి విగ్రహాలకు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

కూనవరం: కార్తీక మాసం పాడ్యమి పురస్కరించుకుని శబరి, గోదావరి సంగమ తీరంలో భక్తులు శనివారం పుణ్యస్నానాలు ఆచరించా రు. శ్రీ దుర్గాంబ సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సంగమేశ్వరస్వామి, అమ్మవారుతోపాటు ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం నిర్వహించా రు. అర్చకులు లక్ష్మీ నర్సింహశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

అర్హులందరికీ జన్‌మన్ ఇళ్లు



జన్‌మన్ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ బాబు

గూడెంకొత్తవీధి: అర్హులైన పీవీటీజీలందరికీ పీఎం జన్‌మన్ పథకంలో ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు హౌసింగ్ పీడీ బాబు తెలిపారు. మండలంలోని ఏబులంకొడిసింగిలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పునాదులు నిర్మించిన పదిరోజుల్లోగా లబ్ధిదా రుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతాయన్నారు. అర్హులైన వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏఈ సూరిబాబు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చిట్టిపడాల్ పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాల బిల్లులు చెల్లింపు



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

చింతపల్లి: పక్కా గృహాల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హౌసింగ్ పీడీ బాబు వెల్లడించారు. శనివారం ఆయన మండలంలోని మడిగుంట గ్రామంలో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పీఎం జన్‌మన్ పథకంలో 2022–23, 2024–25లో 25వేల పక్కాఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. ఒక్కొక్క దానికి రూ.2.39 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. పీఎం గ్రామీణ పథకంలో 17,111 ఇళ్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు. వీటిలో ఇప్పటివరకు 2,215 ఇళ్లు పూర్తి చేసినట్టు తెలిపారు. డిసెంబర్ నాటికి 667 ఇళ్లు పూర్తిచేస్తామన్నారు. మార్చి నాటికి అన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వారం రోజుల్లో వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఈ కె. రమణబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజారావు పాల్గొన్నారు.

సామాజిక శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, జేఏసీ కన్వీనర్ రామారావుదొర

సాక్షి,పాడేరు: ఈనెల 15న భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని అరకులోయ టీటీడీ మండపంలో ఈనెల 9,10తేదీల్లో జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థి సంఘం సామాజిక అంశాలు, గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణపై అరకులోయ వేదికగా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావుదొర, గిరిజన విద్యార్థి సంఘం నేతలు తెల్ల బాబు, రమేష్, మాధవరావు, కిషోర్, బాబి, అనిల్, రాంబాబు, శేఖర్, శివ, వంతాల భీమ్ పాల్గొన్నారు.

యంత్రాలకు తుప్పు..

జోలాపుట్టు డ్యామ్‌కు పొంచి ఉన్న ముప్పు.. నిర్వహణపై దృష్టిపెట్టని ఆంధ్రా- ఒడిశా ప్రభుత్వాలు



డ్యామ్ దిగువున పిచ్చిమొక్కల మధ్య సెక్యూరిటీ సిబ్బంది


జోలాపుట్టు జలాశయం.. జిల్లాలోని మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించడంలో కీలకం. అటువంటి ప్రాజెక్టుపై ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. నిర్వహణ లోపం వల్ల ప్రాజెక్టు యంత్రాలు తుప్పుపట్టాయి. ప్రాజెక్ట్ డ్యామ్ నాచుపట్టి కళావిహీనంగా మారింది.



కళావిహీనంగా జోలాపుట్టు ప్రాజెక్ట్ డ్యామ్

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు ప్రాజెక్ట్‌కు ముప్పు పొంచి ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆంధ్రా–ఒడిశా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- 1955లో నిర్మించిన ఈ జలాశయం ఇప్పటికి 67 ఏళ్లు అవుతోంది. జలాశయం నుంచి నీటిని విడుదల చేసే పవర్ గేట్లు, టర్బైన్లు, నీటిని కొలిచే ఐరన్ మార్గంలో రాడ్లతో పాటు పలు యంత్రాలు తప్పుపట్టాయి. వీటి నిర్వహణపై దృష్టిపెట్టకపోవడం వల్ల నీటి విడుదల సమయంలో భవిష్యత్తులో సాంకేతిక సమస్యలు తలెత్తే ఆస్కారం ఉందని పలువురు సూచిస్తున్నారు.
- జోలాపుట్టు ప్రాజెక్ట్ జిల్లాలోని జలవిద్యుత్ కేంద్రాలకు పెద్ద దిక్కు. ఈ ప్రాజెక్ట్ నుంచి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి వెళ్తుంది. అక్కడ ఉత్పత్తి అనంతరం విడుదల అయ్యే నీరు బలిమెల జలాశయంలో చేరుతుంది. అక్కడి నుంచి గుంటవాడ జలాశయం ద్వారా సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి సరఫరా అవుతుంది. అనంతరం విడుదల అయ్యేనీరు డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతుంది. ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు సీలేరు నదిలో కలిసి గోదావరిలో చేరుతుంది. ఈ నీటిని రబీలో గోదావరి డెల్టా సాగునీటికి ఉపయోగిస్తారు. మొత్తమ్మీద 845 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తోంది.
- జోలాపుట్టు జలాశయం డ్యామ్‌పై గేట్లకు సంబంధించిన యంత్రాలు తుప్పు పట్టాయి. నీటిని విడుదల చేసే మార్గంలో షాంప్ వాల్‌కు సంబంధించిన ఐరన్, నాలుగు గేట్లు తుప్పు పట్టాయి. అత్యవసర పరిస్థితిల్లో గేట్లు ఎత్తేటప్పుడు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. షాంప్ వాల్ మార్గంలోని సిమెంట్ దిమ్మల్లో కొన్ని పాడయ్యాయి. ప్రాజెక్ట్‌లో నీటిని కొలిచేందుకు వెళ్తున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా జలాశయంలో పడిపోయే ప్రమాదం ఉంది.
- జలాశయం దిగువ భాగంలో పర్యవేక్షణ నిమిత్తం గతంలో నిర్మించిన సెక్యూరిటీ హౌస్ ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. దీంతో జలాశయ ఎగువ భాగంలో ఉన్న సెక్యూరిటీ హౌస్ వద్ద ఉంటూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.
- జలాశయం డ్యామ్‌పై విద్యుత్ స్తంభాలకు ఏర్పాటుచేసిన దీపాలు పగిలిపోయాయి. వీటిలో కొన్ని మాత్రమే వెలుగుతున్నాయి.
- జలవిద్యుత్ కేంద్రాలకు నీరు అందిస్తూ, ఆదాయం తెచ్చి పెడుతున్నా ప్రధాన జోలాపుట్టు జలాశయం బాగోగులపై ఇరు రాష్ట్రాల ప్రాజెక్టు అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్వహణ పనుల నిమిత్తం ఏటా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు విడుదల అవుతుంటాయి. వీటిని వెచ్చించినా ప్రాజెక్ట్ పరిస్థితి మెరుగుపడుతుందని పలువురు సూచిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన షాంప్ వాల్ సిమెంటు దిమ్మలు




నిర్వహణ లోపం వల్ల తుప్పు పట్టిన జోలాపుట్టు డ్యామ్ గేట్ల యంత్రాలు

త్వరలోనే నిర్వహణ పనులు చేపడతాం

జోలాపుట్టు జలాశయం పరిస్థితులపై ఇప్పటికే రెండు రాష్ట్రాలకు చెందిన ప్రాజెక్ట్ ఉన్నతాధికారులతో కూడిన బృందాలు అధ్యయనం చేశాయి. కల్పించాల్సిన సౌకర్యాలపై నివేదికను ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు, అధికారులకు అందజేశాయి. ప్రస్తుత జలాశయ పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. విధులు నిర్వహించే జలాశయ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాం. త్వరలోనే ప్రాజెక్ట్ నిర్వహణ పనులు చేపడతాం.

– ఏవీ సుబ్రమణేశ్వరరావు, ఎస్ఈ, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

పండుతున్న కాఫీ



మన్యంలో కాఫీతోటలు పక్వానికి చేరుకున్నాయి. పాడేరు డివిజన్లో 1.48 లక్షల ఎకరాల్లో కాఫీని పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడి బాగుంది. ప్రస్తుతం పండ్ల దశకు చేరుకుంటుండంతో ఈ నెలాఖరు నుంచి సేకరణ ప్రారంభం కానుంది.

– సాక్షి, పాడేరు

ఆలయాలకు కార్తీక శోభ

పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు



ఎంపీ తనూజారాణి దంపతులను సత్కరిస్తున్న ఉమానీలకంఠేశ్వరస్వామి కమిటీ ప్రతినిధులు



పాడేరులో ఉమానీలకంఠేశ్వరస్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు



శివదీక్ష చేపట్టిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



అరకులో ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

సాక్షి,పాడేరు: ఆలయాలకు కార్తీక శోభన నెలకొంది. శనివారం తెల్లవారుజామునుంచి భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం, అరకు భ్రమరాంబదేవి సమేత మల్లికార్జునస్వామి, పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయాలకు భక్తుల తాకిడి నెలకొంది. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో విడిచిపెట్టారు. ఆలయాల్లో ఆకాశదీపాన్ని వెలిగించారు. అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి, చెట్టి వినయ్ దంపతులు ఉమానీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ప్రధాన అర్చకులు రామంపంతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, సోమరాజు, రామారావు తదితరులు సత్కరించారు. స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాతపాడేరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం 41రోజుల శివదీక్షను చేపట్టారు.

మేకను కాపాడబోయి.. కొండచిలువకు చిక్కి..

- ప్రాణం కోల్పోయిన శునకం
- విశ్వాసానికి ప్రతి రూపంగా మూగజీవి



కొండచిలువను చంపి మేకల కాపరులు బయటకు తీసిన శునకం కళేబరం

కొయ్యూరు: జంతువులు కూడా సంతోషిస్తాయి.. ప్రేమిస్తాయి.. స్నేహం చేస్తాయి. ఇలా ఉంటూ అందరిని ఆశ్చర్య పరుస్తూ ఉంటాయి. అయితే ప్రాణాలిచ్చే స్నేహితులున్నారో లేదో తెలియదు గానీ... మేక కోసం ఓ శునకం మాత్రం ప్రాణాలిచ్చింది. విశ్వాసానికి మళ్లీ తానే రాజునని చాటిచెప్పింది. ఏజెన్సీలో మేత కోసం రోజూ కొన్ని మేకలు..వాటి యజమానులు..వీరి వెంట విశ్వాసానికి ప్రాణమిచ్చే కొన్ని శునకాలు అడవికి వెళుతుంటాయి. ఈ క్రమంలో శనివారం ఓ మేకను కొండచిలువ అమాంతం మింగేందుకు ప్రయత్నించింది. ఇది చూసిన శునకం ..కొండచిలువపై తిరగబడింది. నా స్నేహితుడినే మింగుతావా అంటూ భయపెట్టింది. కానీ కొండచిలువ బలం ముందు శునకం లొంగిపోక తప్పలేదు. కొండచిలువ ఆ శునకాన్ని మింగేసింది. కాపర్లు కొండచిలువను చంపి దాని పొట్టలోంచి శునకాన్ని తీశారు. కానీ అప్పటికే ఊపిరాడక మృతి చెందింది. ఈ ఆసక్తికరమైన ఘటన మండలంలోని మంప పంచాయతీ గొడుగులమ్మబంద అటవీప్రాంతంలో చోటుచేసుకుంది.

నెట్‌బాల్ ఉమ్మడి విశాఖ జట్టు ఎంపిక

అగనంపూడి (విశాఖ): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నెట్‌బాల్ ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపికను కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం చేపట్టారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి నెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఉమ్మడి విశాఖ జట్టుగా ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, ఉక్కు కార్మిక సంఘం నాయకులు విందుల వెంకటరమణ, హెచ్ఎం సూర్య ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్నేక్ హల్‌చల్

డోకులూరులో పట్టుకున్న స్నేక్ క్యాచర్ ఉదయ్‌భాస్కర్



ఫ్లయింగ్ స్నేక్‌ను పట్టుకున్న ఉదయ్‌భాస్కర్

సాక్షి,పాడేరు: అరుదుగా కనిపించే ఓరంటో ఫ్లయింగ్ స్నేక్ శనివారం మండలంలోని డోకులూరులో హల్‌చల్ చేసింది. ఇదే గ్రామంలోని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తమర్బ బాబురావునాయుడు పెంకుటిల్లుపై సంచరించడాన్ని తెలుసుకున్న స్నేక్ క్యాచర్ బండారు ఉదయ్ భాస్కర్ అక్కడికి చేరుకున్నారు. పెంకుల కింద ఉన్న దానిని చాకచాక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ సీసాలో భద్రపరిచారు. ఇలావుండగా ఎరుపు, నలుపు,బంగారు వర్ణంలో ఉండే ఈ అరుదైన పాము గత నెల 8వతేదీన పాడేరు పట్టణంలోని చాకలిపేటలో ఆయనే పట్టుకోవడం తెలిసిందే. ఇలాంటి పాములు ఏజెన్సీ ప్రాంతంలో సంచరించే అవకాశం ఉందని స్నేక్ క్యాచర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

- చింతపల్లి డీఎస్పీ షహబాజ్ అహ్మద్
- బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీకి అభినందనలు తెలుపుతున్న సబ్ డివిజన్ పోలీసు అధికారులు

చింతపల్లి : చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ అన్నారు. శనివారం ఆయన స్థానిక సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో ముఖ్యంగా గంజాయి, మావోయిస్టులు కార్యక్రమాల నిరోధంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు ఆయన పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు సీఐలు, ఎస్ఐలు,అదనపు ఎస్ఐలు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అనంతగిరి (అరకులోయ రూరల్): విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. శనివారం ఆయన శివలింగపురం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. భోజనాలు, విద్యా ప్రమాణాలు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అప్పారావు, ఎంపీటీసీ శత్రుఘ్నన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది లేక ఇబ్బందులు

తీగలవలసలో గిరిజనుల నిరసన



తీగలవలస సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

హుకుంపేట: మండలంలోని తీగలవలస గ్రామ సచివాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కిల్లో కామరాజు మాట్లాడుతూ గ్రామ సచివాలయ కేంద్రంలో వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాలకోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వీఆర్వో బదిలీ అయినప్పటికీ, ఆయన బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదని వాపోయారు. డిజిటల్ అసిస్టెంట్ ఉన్నప్పటికీ విధులకు హాజరు కావడం లేదన్నారు.

మన్యానికి సందర్శకుల తాకిడి



చాపరాయి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: మన్యానికి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. శనివారం చాపరాయి జలవిహారికి భారీగా తరలివచ్చారు. వలిసె, పొదుతిరుగుడు తోటల్లో ఫొటోలు తీసుకుని సందడి చేశారు. చాపరాయి జలవిహారిని ఉదయం ఆరు గంటలకు కాకుండా 9 గంటలకు తెరవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. అధికారులు ఉదయం ఆరు గంటల నుంచి తెరిచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పంతలచింతలో వలిసె, పొద్దుతిరుగుడు తోటల్లో పర్యాటకులు

పింఛన్ల పంపిణీలో గంగవరం ప్రథమ స్థానం

గంగవరం : సామాజిక పింఛన్ల పంపిణీలో గంగవరం మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పీజీ రామకృష్ణ తెలిపారు. మండలంలో 3884 పింఛన్లకు గాను 3861 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



అరకులోయ డిగ్రీ కళాశాలలో ధ్రువపత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్ప రాజ్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యోగా, ధ్యానంపై దృష్టి సారించాలని, దీంతో ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. లక్ష్యంతో చదివితే ఉన్నత పదవులు సాధ్యమన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, వసుపులేటి నాగబాబు, మొష్యా అనితకుమారి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

గంగవరం: మండల కేంద్రంలోని వై.జంక్షన్‌లో ఎస్ఐ భూషణం ఆధ్వర్యంలో పరివర్తన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, మద్యపానం వంటి జోలికి వెళ్లొద్దన్నారు. మండలంలో రోడ్డు ప్రమాదాల్లో మద్యం సేవించిన డ్రైవర్లు ఎక్కువగా ఉంటున్నారన్నారు. గంజాయి, సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనచోదకుల రికార్డులు పరిశీలించారు. ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.


గంగవరంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ భూషణం

మైనర్లతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం

అరకులోయ రూరల్: బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సహాయ లేబర్ అధికారి సూర్యనారాయణ చెప్పారు. మండల కేంద్రంలో శనివారం పోలీస్ శాఖ, శిశు సంక్షేమ, విద్యా శాఖలు సంయుక్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలతో వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన్నట్టు ఫిర్యాదులు వస్తే బాధ్యులపై బాలకార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో పలు వ్యాపార దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ గోపాల్‌రావు, ఎంఈవో భారతిరత్నం, సీడీపీవో శారద, సిబ్బంది తదితరులున్నారు.


అవగాహన కల్పిస్తున్న సహాయ లేబర్ అధికారి సూర్యనారాయణ

ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక

- రూ.47 కోట్ల పనులపై సమీక్ష
- రూ.1.38లక్షల రికవరీకి ఆదేశాలు
- రూ.1.17 కోట్ల దుర్వినియోగమైనట్టు వెల్లడి
- మస్తర్లలో అక్రమాలు
- బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- డ్వామా పీడీ శివయ్య, విజిలెన్స్ అధికారి నిర్మలదేవి


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యూరు: మండలంలో 2023–24కు సంబంధించిన ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రూ.47.73 కోట్ల పనులపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో 15వ సామాజిక తనిఖీల ప్రజావేదికను నిర్వహించారు. ఉపాధి పనులకు సంబంధించి ఖర్చు చేసిన నిధులను వివరించారు. మండలంలోని మొత్తం 2,385 పనులను చేపట్టారని, ఇందులో రూ.25.96 కోట్లను కూలీలకు వేతనాలుగా చెల్లించినట్టు అధికారులు తెలిపారు. మెటీరియల్‌కు రూ.21.77 కోట్లు చెల్లించినట్టు వెల్లడించారు. పీడీ శివయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల దేవి, సహాయ విజిలెన్స్ అధికారి వెంకటరమణ, ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

మస్తర్లలో అవకతవకలు

మస్తర్లలో అవకతవకలు ఉన్నట్టు గుర్తించారు. ఇందుకోసం రూ.1,38,417 రికవరీకి అధికారులు ఆదేశించారు. ఈ మేరకు రూ.37వేలు జరిమానా విధించారు. మొక్కలు ఎండిపోవడంతో పాటు భూమి చదునులో దున్ని వేయడంతో రూ.1.17కోట్లు వరకు నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించారు. చనిపోయిన మొక్కల స్థానంలో రూ.43 లక్షల విలువైన మొక్కలు నాటారని నివేదించారు. రూ.72,500 పనులను చేపట్టాలని ఆదేశించారు. ఎం.మాకవరం వీఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. తప్పుడు మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. గ్రామసభలో ఫిర్యాదు చేశామని స్థానికులు చెప్పారు. పిట్టచలం, పనసలపాలెంలో ఉపాధి సిబ్బంది పనితీరుపై గ్రామస్తులు అధికారులకు చెప్పారు.

దీంతో ఆయా గ్రామాల్లో కొత్త వీఆర్‌పీలను నియమిస్తామని డ్వామా పీడీ శివయ్య చెప్పారు. యూ.చీడిపాలెం పంచాయతీలో ఉద్యోగి పేరిట మస్తరు నమోదు చేశారని, దీనిపై విచారించినట్టు తెలిపారు. హార్టీకల్చర్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన పండ్ల మొక్కలు ఇస్తున్నామన్నారు. అవినీతికి పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐపీఈ విస్తరణ

- ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్‌తో రోడ్ మ్యాప్
- పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, కొత్త కోర్సులపై అధ్యయనం
- 2025 నాటికి శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తి
- ఈలోగా రెండో దశ అభివృద్ధికి సన్నాహాలు
- రూ.50 కోట్లతో వివిధ పరిశోధనల ప్రాజెక్టులపై పనిచేస్తున్న ఐఐపీఈ


చురుగ్గా సాగుతున్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ పనులు

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)ను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాతికేళ్ల విస్తరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అనుబంధంగా ఉన్న ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్)కు సంస్థ భవిష్యత్ రోడ్ మ్యాప్ సిద్ధం చేసే బాధ్యతను అప్పగించింది. విస్తరణ ప్రణాళికలో భాగంగా పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, కొత్త కోర్సుల ప్రవేశపెట్టడం తదితర అంశాలపై ఈడీసీఐఎల్ దృష్టి సారించనుంది. మరో వైపు ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి క్యాంపస్ పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్, నక్కపల్లి, రాంబిల్లి పారిశ్రామిక క్లస్టర్లు కీలకమైనవి. జిల్లాకు సమీపంలోని కృష్ణా గోదావరి పరివాహక ప్రాంతం (కేజీ బేసిన్)లో అపారమైన చమురు, సహజవాయువు నిల్వలున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రంగంలో నిపుణులు, నైపుణ్యమున్న సిబ్బంది కొరత ఉంది. ఈ లోటును పూడ్చడంతో పాటు చమురు, ఇంధన రంగ అభివృద్ధికి అవసరమైన పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో విశాఖలో ఐఐపీఈ ఏర్పాటుకు విభజన చట్టంలో భాగంగా కేంద్రం మొగ్గు చూపింది. కేంద్ర చమురు, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఐవోఎల్ సహకారం అందిస్తున్నాయి. ఏయూలో 2016లో ఐఐపీఈ తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటు చేశారు. ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ కోసం సబ్బవరం మండలం వంగలి గ్రామ పరిధి సర్వే నంబర్ 135/2లో 147.58 ఎకరాలు, 241/3లో 54.22 ఎకరాల చొప్పున మొత్తం 201.80 ఎకరాలను కేటాయించారు. అప్పట్లో పరిహారం విషయమై ఇబ్బందులు తలెత్తగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివాదాలను పరిష్కరించడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

చురుగ్గా సాగుతున్న పనులు

శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా వ్యవహరిస్తోంది. కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్ట్ బాధ్యతలు అప్పగించారు. 2022లో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈస్టర్న్ అకాడమీ బ్లాక్, మూడు హాస్టల్ బ్లాక్‌లు, మెస్ బ్లాక్, 8 విభాగాలకు సంబంధించిన క్వార్టర్స్, గెస్ట్ హౌస్, డైరెక్టర్ రెసిడెన్సీ, ఓవర్‌హెడ్ ట్యాంక్ మొదలైన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. జూన్ కల్లా క్యాంపస్ సమగ్రంగా సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగా పనులు చేపడుతున్నారు.

వర్సిటీ రెండో దశ అభివృద్ధికి ప్రణాళికలు

ఐఐపీఈ తొలి దశలో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రాంలు అందిస్తోంది. బీటెక్‌లో పెట్రోలియం ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సుకు 60 సీట్లు ఉన్నాయి. ఎమ్మెస్సీలో అప్లైడ్ జియాలజీ, ఎంటెక్‌లో ఎనర్జీ ఇంజినీరింగ్ కోర్సులు అందిస్తోంది. వీటితో పాటు అదనంగా ఏమైనా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలా? సీట్లు పెంపొందించేందుకు ఉన్న అవకాశాలు? మొదలైన అంశాలపై అడ్మిషన్ల పరంగా రోడ్ మ్యాప్ సిద్ధమవుతోంది. అలాగే ఈడీసీఐఎల్.. వచ్చే 25 ఏళ్లకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. పెట్రోలియం, ఇంధన డొమైన్లలో ఐఐపీఈ అగ్రగామిగా అవతరించేందుకు ఉన్న అవకాశాలపైనా అధ్యయనం కొనసాగుతోంది.

పరిశోధనలపై ప్రత్యేక దృష్టి

రెండో దశలో యూనివర్సిటీ విస్తరణ ప్రణాళికలో పరిశోధనలకు పెద్దపీట వేయాలని భావిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి, కొత్త ప్రోగ్రామ్‌ల ఆఫర్లు, విద్యార్థుల నమోదు, పరిశ్రమల సహకారాలు, అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాలు మొదలైన కీలక అంశాలతో కూడిన వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకుగానూ గ్రౌండ్ లెవల్ అసెస్‌మెంట్ నిర్వహిస్తోంది. ఇందుకోసం ఐఐపీఈ అధికారులు, కేంద్ర మంత్రిత్వ శాఖ నిపుణులు, పారిశ్రామిక స్టేక్ హోల్డర్స్, విద్యా నిపుణులతో ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్) సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే రెండో దశ విస్తరణకు సంబంధించి పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అధ్యక్షతన ఇటీవలే సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు.

పీహెచ్‌డీ స్కాలర్లు పెరుగుతున్నారు



ఐఐపీఈలో పీహెచ్‌డీ స్కాలర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2021లో కేవలం నలుగురితో మొదలై ప్రస్తుతం 101కి చేరుకుంది. గత మూడేళ్లలో పరిశ్రమల ప్రాజెక్ట్‌ల సంఖ్య 8 నుంచి 30కి పెరగడంతో పారిశ్రామిక సహకారం బలోపేతమైంది. పరిశోధనలకు సంబంధించి మొత్తం రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నాలుగు పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. 115 పరిశోధన పత్రాలను ప్రచురించాం. గణనీయమైన ఫలితాలతో ప్లేస్‌మెంట్స్ 98 శాతానికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే రెండో దశ అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ప్రొ.శాలివాహన్ శ్రీవాస్తవ, ఐఐపీఈ డైరెక్టర్

ప్రజల పక్షాన నిలబడిన సాయిబాబాను చంపేశారు

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్

సీతంపేట: ప్రజల పక్షాన నిలబడినందుకే ప్రొఫెసర్ సాయిబాబాను కేంద్రంలోని మనువాద ప్రభుత్వం చంపేసిందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక చంద్రశేఖర్ ఆరోపించారు. పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ఆచార్య సాయిబాబా స్మృతి సదస్సు జరిగింది. ముందుగా సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆపరేషన్ కగార్ అంశంపై చంద్రశేఖర్ ప్రసంగిస్తూ ప్రజల పక్షాన నిలబడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కక్ష కట్టిందని, దానికి సాయిబాబా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో పదో తరగతి అర్హత ఉన్న వారికి ప్రభుత్వమే తుపాకులు అందజేసి ఆదివాసులకు అండగా నిలిచిన వారిపై కాల్పులు చేయిస్తోందని విమర్శించారు. మోదీ, అమిత్‌షా వచ్చిన తర్వాత ఉప చట్టాన్ని మరింత కఠినతరం చేసి హక్కుల నేతల గొంతు నొక్కేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే చట్టాలు తీసుకువచ్చి సాయిబాబాను పదేళ్లు జైల్లో ఉంచి చంపేశారన్నారు. హైదరాబాద్ సల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళి 'మూడు క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై మాట్లాడారు. సాయిబాబా విడుదల కోసం చట్టప్రకారం పోరాటం చేసిన ఇద్దరు ప్రొఫెసర్లు జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఏడాదికి 74 లక్షల ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతున్నాయని, సుమారు 6 లక్షల మంది అరెస్ట్ అవుతున్నారన్నారు. భారతీయ జైళ్లలో 88 శాతం మంది దిగువ వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. విరసం నేత కృష్ణ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలోని చిన్న గ్రామంలో సాయిబాబా జన్మించారని, హక్కుల మేధావిని మావోయిస్టుగా ముద్రవేసి జైలుకి పంపారన్నారు. మహిళా న్యాయవాది పద్మ మాట్లాడుతూ సాయిబాబాను హత్య చేసేంత వరకు పాలకులు నిద్రపోలేదన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మి, డాక్టర్ కొల్లా రాజమోహన్, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు అందని జీతాలు?

విశాఖ విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అప్పుడే మాట తప్పింది. ఉపాధ్యాయులకు అక్టోబర్‌కు సంబంధించిన వేతనాలు ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. ఈ నెల 3న ఆదివారం సెలవు కావడంతో సోమవారం తర్వాతే మోక్షం కలిగే అవకాశం ఉంది. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు వేస్తున్నారు. జూలైలో 1న జీతాలు చెల్లించి, తాము ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పినా, ఆగస్టులో 2న, సెప్టెంబర్‌లో 3న, అక్టోబర్‌లో 4న, తాజాగా అక్టోబర్‌కు సంబంధించి ఈ నెల 5న వేతనాలు పొందుతున్నామని సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. ఉపాధ్యాయ వర్గం మరలా నిరాదరణకు గురవుతోందని, ఒక్క విద్యాశాఖలోనే ఇలాంటి దౌర్భాగ్యమని, ఇలా అయితే ఈఎంఐలు, ఇంటి అద్దెలు, పిల్లలు ఫీజులు సమయానికి కట్టేదెలా అంటూ మరో వాట్సాప్ గ్రూప్‌లో ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. జీతాలు అడుక్కోవడం ఏంటి..? అది మీ హక్కు అన్న వారే..ఆ మాట మరిచిపోతున్నారని మరికొంతమంది ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని శాఖల ఉద్యోగులకు వేతనాలు జమ అయినప్పటికీ, టీచర్లకు సంబంధించిన బిల్లులపై క్లారిటీ లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

నేత్రపర్వం.. నృత్యోత్సవం


నాట్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నాట్యకారిణుల నృత్య విన్యాసాలు అబ్బురపరిచాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీహరిపురానికి చెందిన సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 7వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. నాట్య గురువు అరుణా పరమేష్ ఆధ్వర్యంలో సుశిక్షితులైన 36 మంది చిన్నారులు కృతులకనుగుణమైన హావభావాలతో నాట్య కచేరీని ఆద్యంతం రక్తికట్టించారు. సనాతన సంప్రదాయాలను ఒడిసిపట్టి అపురూపంగా ప్రదర్శించిన చిన్నారుల నైపుణ్యాలు రసజ్ఞులైన ప్రేక్షక హృదయాలను దోచుకున్నాయి. గణేశ శ్లోకంతో ఉత్సవ ప్రదర్శనలకు శ్రీకారం చుట్టగా.. 16 మంది సీనియర్ విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శించారు. డాక్టర్ వెంపటి చిన సత్యం నృత్యపరికల్పన చేసిన బ్రహ్మాంజలి(ఆదితాళం, రాగమాలిక)కి 20 మంది నర్తకీమణులు చక్కటి సమన్వయంతో చూడ ముచ్చటగా నృత్యప్రదర్శన సాగింది. అన్నమాచార్య సంకీర్తనలకు బాలల నాట్య ముద్రలు, అభినయ కౌశలం ప్రేక్షకుల హర్షధ్వానాలందుకున్నాయి.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

జి.మాడుగుల: వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలను సందర్శించారు. దీనిలో భాగంగా స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల హెల్త్ బుక్స్, చిన్న పిల్లల వ్యాక్సిన్‌ను పరిశీలించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, ఆహారం, వైద్యం, బాలింతల ఆరోగ్యంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కె.కోడాపల్లి,జి.మాడుగుల సచివాలయాల పరిధిలోని మత్స్యపురం,గాం. దీనగరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మత్స్యపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

దుంబ్రిగుడ: జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన శెట్టి లోహిత్‌బాబును మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన శెట్టి లోహిత్‌బాబు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు లోహిత్‌కు అన్ని విధాలుగా ట్రస్టు తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మన్యానికి ఆణిముత్యం లాంటి బిడ్డను అందించి, క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్న లోహిత్ తల్లిదండ్రులను అభినందించారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, గణేష్, పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కిరణ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రంజిత్‌కుమార్, నాయకులు కృష్ణారావు, సింహాచలం, త్రినాథరావు, రామారావు, పోతంగి వైస్ సర్పంచ్ జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుడు లోహిత్‌బాబును సన్మానిస్తున్న మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్

సారాతో ఇద్దరి అరెస్టు

హుకుంపేట: సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎల్.సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని గూడ పంచాయతీ గొచ్చరి గ్రామానికి చెందిన పాంగి రామకృష్ణ, రంగసింగిపాడు గ్రామానికి చెందిన వలసనైని సింహాచలంను సారా విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

జూదం ఆడుతున్న ఏడుగురు అరెస్టు

మండలంలోని దాలిగుమ్మడి ప్రాంతంలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. జూదం ఆడుతున్న సమయంలో ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురు వ్యక్తులతో పాటు రూ.12,860 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ చెప్పారు.

వరి పంటలో పొటాష్ లోపం గుర్తించాలి

అనకాపల్లి: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వరి పంటలో పొటాష్ లోపం కనిపిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులతో టి అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట సాగులో సిఫారసు చేసిన పొటాష్ ఎరువును ఎంవోపీ రూపంలో 35 కిలోలు రెండు సమ భాగాలుగా దమ్ములో సగం, నాటిన 60 రోజులకు మిగిలిన సగం ఉపయోగించవలసి ఉందన్నారు. అయితే రైతులు పొటాష్ ఖర్చుపెరిగిన కారణంగా దానిని తగ్గిస్తుండడంతో వరి పంటలో పొటాష్ లోపం కనిపిస్తుందన్నారు. రైతులందరు సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించి పైర్లలో పొటాష్, బాస్వరం, జింకు లోపాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా నిర్వహిస్తున్న కార్యక్రమల్లో శాస్త్రవేతలు పాల్గొని రైతులకు తగిన సలహాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పీవీకే జగన్నాథరావు, కె.వి.రమణమూర్తి, పి.వి.పద్మావతి, ఎంబీజీఎస్ కుమారి, డి.ఉమామహేశ్వరరావు, జిల్లాలో వివిధ మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.